
# అబ్రకదబ్ర... అబ్బాయి మనసు!

కథ



రాజారావు ఇంద్రజాలికుడు. ఆయన ఇంద్రజాలం చేస్తున్నాడంటే జనం ఇసకేస్తే రాలనంత మంది వస్తారు. విన్యాసాల్ని కళ్లార్పకుండా చూసి చప్పట్లు కొట్టి సంతోషపడతారు.

ఆ రోజు కూడా రాఘవపురం మైదానంలో రాజారావు రకరకాల విన్యాసాలు ప్రదర్శిస్తున్నాడు.

'చూడండీ పిల్లలూ నా చేతిలో ఈ ఖాళీ టోపీని చూడండి. అబ్రకదబ్ర' అంటూ ఎడమ చేతిలో నల్లటి టోపీ పట్టుకుని కర్రతో దాని చుట్టూ మూడుసార్లు తిప్పి అందులో నుంచి చాక్లెట్లు తీసి అక్కడున్న పిల్లలందరికీ ఇచ్చాడు.

ఆ తర్వాత కుందేళ్లను రామచిలుకలుగా చేశాడు. తువ్వాలును పావురాయిగా మార్చాడు. మామూలు ఈకల్ని నెమలీకల విసనకర్ర చేసి విసురుకున్నాడు.

అక్కడికి వచ్చిన పిల్లలతోపాటు వచ్చిన పెద్దలు కూడా తమ సంతోషాన్ని చప్పట్లు కొట్టి, ఈలలు వేసి వ్యక్తం చేస్తూ ఆనందపడసాగారు.

అలా ఆ ఇంద్రజాలం రెండుగంటలపాటు సాగింది. అందరూ ఇళ్లకు వెళదామని లేచారు.

ఇంద్రజాలాన్ని చూడ్డానికి వచ్చిన ఏడేళ్ల సాయిలు వాళ్ల నాన్నతో, 'నాన్నా! నేను ఒక్కసారి మాయలు చేసే ఆ మావయ్యతో మాట్లాడుతా' అన్నాడు.

ఆయన సరేనని కొడుకును రాజారావు దగ్గరికి తీసుకెళ్లారు.

రాజారావు సాయిలు బుగ్గలు పుణికి 'బాబూ! ప్రదర్శన నచ్చిందా?' అడిగాడు. నచ్చిందన్నట్టు తలూపాడు సాయిలు.

'నీకేం కావాలి? మిఠాయిలా? ఇదిగో' అంటూ అప్పటికప్పుడు చమత్కారం చేసి సాయిలు చేతిలో మిఠాయి బిళ్ల పెట్టాడు రాజారావు. సాయిలు అవేం వద్దన్నట్టుగా అడ్డంగా తలూపాడు. 'మరేం కావాలి?' అడిగాడు రాజారావు చనువుగా.

'మీరు ఎన్నో వస్తువులు సృష్టిస్తున్నారుగా! మా బడిలో ఎంతో మంది పేద పిల్లలు ఉన్నారు. వాళ్లకి కట్టుకోవడానికి దుస్తులు లేవు. తినడానికి తిండి లేదు. పుస్తకాలు కొనడానికి డబ్బుల్లేవు. వాళ్లకి అవన్నీ సృష్టించి ఇవ్వచ్చు కదా' అని జాలిగా అడిగాడు.

'ఇంద్రజాలం అనేది హస్తలాఘవం, లేనివాటిని సృష్టించి ఇవ్వలేము' అని చెప్పాలకున్నాడు. కానీ ఆ పసివాడికి చెప్పినా అర్థం కాదనుకున్నాడు. అంత చిన్న వయసులో సాటి పిల్లల కోసం ఆలోచించే సాయిలు మంచి మనసు చూసి రాజారావు కళ్లలో నీళ్లు తిరిగాయి.

వెంటనే 'అబ్రకదబ్ర' అని ఖాళీ టోపీలో చేయి పెట్టి ఆనాటి ప్రదర్శనకు వచ్చిన డబ్బును అప్పటికప్పుడు సృష్టించినట్టుగా తీసి సాయిలుకు ఇచ్చేశాడు రాజారావు. సాయిలు వాళ్ల నాన్న ఇది చూసి ఆశ్చర్యపోయినా, రాజారావు ఇచ్చిన సొమ్ముకు తను కూడా కొంత సొమ్ము జతచేసి కొడుకు కోరిక మేరకు దుస్తులు, పుస్తకాలు కొని సాయిలు చేత పేద పిల్లలకు పంచిపెట్టించాడు.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు